కబ్జా కోరల్లో ఆలయ భూమి 2





మెనూ ప్రకారం భోజనం అందించాలి 2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## పార్ట్ టైం ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని మోడల్ స్కూల్‌లో పీజీటీ గణితశాస్త్రం బోధించేందుకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తోట గాంధీ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు బోధించేందుకు ఎమ్మెస్సీ మ్యాథ్స్ , బీఈడీ పూర్తి చేసినవారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే డెమో క్లాసులకు హాజరుకావాలని సూచించారు.





నిజామాబాద్ నగరంలో నిర్వహించిన రథయాత్రలో ఉత్సవ మూర్తులు



రథయాత్రలో పాల్గొన్న భక్తులు





మాట్లాడుతున్న ప్రనవానంద దాస్, సీపీ సాయిచైతన్య

# కనుల పండువగా జగన్నాథ రథయాత్ర

జై జగన్నాథ్.. జై జై జగన్నాథ్.. హరే రామ్.. హరే కృష్ణ.. నినాదాలతో ఇందూరు నగరం మార్మోగింది. ఇస్కాన్ కంఠేశ్వర్ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం జగన్నాథ రథయాత్ర వైభవోపేతంగా కొనసాగింది. నగరంలోని కంఠేశ్వర్ ఆలయం వద్ద పోలీస్ కమిషనర్ సాయి చైతన్య రథయాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి రైల్వే కమాన్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వే స్టేషన్, బస్టాండ్, గాంధీచౌక్, పెద్ద బజార్, ఆర్ఆర్ చౌరస్తా మీదుగా పులాంగ్, విజయలక్ష్మి గార్డెన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కళాకారుల సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, దేవతామూర్తుల వేషధారణ భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. రథయాత్రకు ప్రముఖ ప్రవచనకర్త ప్రణవానంద దాస్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ వెంకట శివకుమార్, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

–అక్షరటుడే, ఇందూరు




## ఘనంగా రోశయ్య జయంతి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతిని ఉమ్మడిజిల్లాలో నిర్వహించారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి.. రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కామారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో నిజామాబాద్ అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, చందర్‌నాయక్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, డీవైఎస్‌వో పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. – అక్షరటుడే, ఇందూరు



## పింఛన్ల కోసం సబ్‌కలెక్టర్‌కు వినతి

**అక్షరటుడే, బాన్సువాడ:** వృద్ధాప్య పింఛన్ల కోసం పలువురికి తిప్పలు తప్పట్లేదు. క్షేత్రస్థాయిలో సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు లబ్ధిదారుల పాలిట శాపంలా మారుతోంది. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో వృద్ధులు, వితంతు, వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేసే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నెలనెలా అందించే పింఛన్లను కేవలం మూడు, నాలుగు రోజులు మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయమై సబ్ కలెక్టర్ కిరణ్మయికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పింఛన్ పంపిణీ గడువును 10 రోజులకు పొడిగించాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో 4,886 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని, నెలలో కేవలం మూడు రోజులు మాత్రమే పంపిణీ చేస్తే.. 50 శాతం మందికి కూడా డబ్బులు అందడంలేదని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో మొచి గణేష్, శివ సూరి, మహేష్, గాండ్ల కృష్ణ, సాయిలు, మౌలా, అనిల్, రాము, గోపి తదితరులు పాల్గొన్నారు.






నిజామాబాద్ నగర పాలక సంస్థలో విచిత్రం వెలుగు చూసింది. ఎవరైనా పనిచేసి జీతం తీసుకుంటారు. ఇక్కడ మాత్రం చాలామంది విధులకు రాకుండానే హాజరు వేసుకుని కథ నడిపించేస్తున్నారు. శానిటరీ విభాగంలో పలువురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు డ్యూటీలు చేయకుండానే జీతాలు పొందుతున్నారు. నగరపాలక సంస్థకు లక్షల రూపాయలు గండి కొడుతున్నారు.

– అక్షరటుడే, ఇందూరు

# విధులకు రాకున్నా.. వేతనం..

- నగరపాలక సంస్థలో విచిత్రం
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బాగోతం
- వంద మందికిపైగా డ్యూటీకి డుమ్మా
- ఏజెన్సీకి నోటీసులిచ్చిన కమిషనర్


నిజామాబాద్ నగర పాలక సంస్థలో పలు విభాగాల్లో సుమారు 1,200 మంది ఉద్యోగులు ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే గత ప్రభుత్వంలో ఓ ప్రజాప్రతినిధి భర్త ఒక ఏజెన్సీ ద్వారా సుమారు 200 మందిని స్వీపర్లు, డ్రైవర్లు, శానిటరీ విభాగంలో పలు ఉద్యోగాలను ఇప్పించారని తెలిసింది. అయితే వీరికి నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఉంటుంది. కానీ, ఇందులో సగం మంది ఉద్యోగులు గతేడాది నుంచి విధులకు హాజరు కావడం లేదని సమాచారం.

### ఇతరులపై పనిభారం..

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో సుమారు వంద మందికి పైగా విధులకు హాజరు కావడంలేదని తెలిసింది. దీంతో ఉన్నవారిపై అదనపు భారం పడుతోందని వాపోతున్నారు. ప్రతిరోజూ తాము గంట నుంచి రెండు గంటలు అదనంగా పనిచేయాల్సి వస్తుందని అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే.. పని చేయకుండానే పలువురు ఏడాదిగా జీతాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

### నోటీసులు జారీ

సిబ్బంది విధులు నిర్వహించకుండానే జీతాలు పొందుతున్నారని నగరపాలక సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఈ విషయమై పలువురు ఉద్యోగులు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో కమిషనర్‌కు దిలీప్ కుమార్ ఇప్పటివరకు 50 మందికి నోటీసులిచ్చారు. అలాగే వీరి నియామకాన్ని చేపట్టిన ఏజెన్సీకి కూడా నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఏడాది కాలంగా విధులకు రాకున్నా.. ఏజెన్సీ నిర్వాహకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు ఏ ఒక్కరిపై చర్యలు తీసుకోకపోవడం కొసమెరుపు.



## వికసించిన బ్రహ్మ కమలం

**అక్షరటుడే, ఇందూరు/కోటగిరి:** హిమాలయాల్లో మాత్రమే వికసించే బ్రహ్మకమలానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ పుష్పం అరుదుగా మాత్రమే పూస్తుంది. అలాంటి బ్రహ్మ కమలం ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలోనూ విరబూసింది. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఏడీఈ తోట రాజశేఖర్ దంపతులు నిజామాబాద్ నగరంలో నివాసం ఉంటున్నారు. వీరు కర్ణాటక రాష్ట్రంలోని మురుడేశ్వర్ నుంచి గతంలో మొక్కను తీసుకువచ్చి తమ ఇంటి ఆవరణలో నాటారు. ప్రస్తుతం ఆ మొక్కకు మూడు పువ్వులు పూశాయి. అలాగే పోతంగల్ మండల కేంద్రంలో జింగరి గంగాధర్, జయశ్రీ దంపతులు బ్రహ్మకమలం మొక్కను బద్రీనాథ్ నుంచి తెచ్చారు. ఆ మొక్క సైతం పుష్పించింది. ఈ సందర్భంగా ఆ పూలకు ప్రత్యేక పూజలు చేశారు.

## పెద్దకొడప్‌గల్ ఎస్సైగా అరుణ్‌కుమార్



**అక్షరటుడే, నిజాంసాగర్:** పెద్దకొడప్‌గల్ ఎస్సై అరుణ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి వీఆర్‌లో ఉన్న ఆయనను పెద్దకొడప్‌గల్ ఎస్సైగా నియమించారు. ఇక్కడ పనిచేసిన మహేందర్‌ను వీఆర్‌కు పంపారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్‌కు ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు ఆటంకం కలిగించే వారిని ఉపేక్షించేది లేదన్నారు.

## రైతులకు అందుబాటులో ఎరువులు..: కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. మాక్లూరు మండలం అమ్రాద్ గ్రామంలోని సహకార సంఘం ఎరువుల గోడౌన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల్లో ఉన్న విధంగా ఎరువుల నిల్వలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అందరికీ అందేలా ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తున్నామన్నారు.

### తహశీల్దార్ కార్యాలయం తనిఖీ

మాక్లూరులోని తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను కేటగిరీల వారీగా విభజిస్తూ.. ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన, ఆమోదం తదితర



అంశాల గురించి తహశీల్దార్ శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం చిన్నాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అమ్రాద్ తండా కాలువ గట్టు మీద వనమోత్సవంలో భాగంగా గతేడాది నాటిన మొక్కలను కలెక్టర్ పరిశీలించారు. మొక్కల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు.

## బీజేపీ అధ్యక్షుడిని కలిసి కోటపాటి

**అక్షరటుడే, ఆర్మూర్:** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్ రావును ఆ పార్టీ నేత, రైతు నాయకుడు కోటపాటి నర్సింహ నాయుడు కలిశారు. శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కోటపాటి మాట్లాడుతూ.. రాంచందర్ రావు తాను కలిసి 1983 నుంచి 86 వరకు ఏబీవీపీలో క్రియాశీలకంగా పనిచేశామని గుర్తు చేసుకున్నారు.





## డబుల్ ఇళ్ల పట్టాల కోసం రోడ్డెక్కిన లబ్ధిదారులు

**అక్షరటుడే, కామారెడ్డి:** ఏళ్లు గడుస్తున్నా డబుల్ బెడ్‌రూం ఇళ్లకు పట్టాలు ఇవ్వట్లేదని లబ్ధిదారులు ఆందోళన చేశారు. ఈ మేరకు రామేశ్వర్ పల్లి డబుల్ ఇళ్ల లబ్ధిదారులు కామారెడ్డి తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్ల కేటాయింపులు చేసి ఏళ్లు గడుస్తోందన్నారు. ఇళ్లు ఇచ్చారని సంబరపడడమే తప్పా పట్టాలు ఇవ్వకపోవడంతో గుర్తింపు లేకుండా పోయిందన్నారు.

## బీసీల హక్కుల కోసం పోరాటం..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బీసీల హక్కుల కోసం మున్ముందు పోరాటాలు ఉధృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సంఘం నగర అధ్యక్షుడిగా కొట్టూరు చంద్రకాంత్ మేరును నియమించారు. అనంతరం ఆయనను సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా నరాల సుధాకర్ మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆర్థికంగా బీసీలు బలపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర నూతన అధ్యక్షుడిగా నియమితులైన చంద్రకాంత్ మేరు నగరంలో సంఘం బలోపేతానికి కృషి చేస్తారని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో సంఘం తరఫున బీసీల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని వారు తెలిపారు. సమావేశంలో సంఘం నగర అధ్యక్షుడు దర్శనం దేవేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్సా ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోల్కం గంగ కిషన్ మేరు, ఆకుల ప్రసాద్, దర్శనం దేవేందర్, కరిపె రవీందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, అజయ్, చంద్రమోహన్, విజయ్, సాయి బసవ, చంద్రకాంత్, విజయ, సదానంద్, హన్మంత్ రావు, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ సభకు బయలుదేరిన కాంగ్రెస్ శేణులు



**అక్షరటుడే, బాన్సువాడ:** హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే కాంగ్రెస్ కార్యకర్తల సన్నాహక సమావేశానికి వర్ని మండలం నుంచి శ్రేణులు బయలుదేరి వెళ్లాయి. పీసీసీ డెలిగేట్ డాక్టర్ కూనీపూర్ రాజారెడ్డి వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో పార్టీ మెజారిటీ స్థానాలు గెలుచుకునేలా అధిష్టానం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లో భారీ సభ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ సభలో జాతీయ అధ్యక్షుడు ఖర్గే పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు రంజానాయక్, అంబర్ సింగ్, కర్లం సాయి రెడ్డి, వెలగపూడి గోపాల్, బారీ, కలాల్ గిరి, నామాల సాయిబాబు, యూత్ కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, రఘు, సాయా గౌడ్, గజ్జల సాయిలు, సాయిలు, ప్రవీణ్ గౌడ్, అహ్మద్, శ్రీనివాస్, నగేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం



**అక్షరటుడే, ఆర్మూర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలతో పాటు ఆ పార్టీ నాయకులు సైతం నైరాశ్యంలో ఉన్నారని పేర్కొన్నారు. భీమ్‌గల్ మండల కేంద్రానికి చెందిన మైనారిటీ నాయకుడు మహ్మద్ అక్రం తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నివాసంలో గులాబీ కండువా కప్పుకున్నారు. గతంలో పార్టీ మారిన వారంతా తిరిగి బీఆర్ఎస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశాంత్ రెడ్డితెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కాలం చెల్లిందని, ఆ పార్టీకి రాష్ట్రంలో మనుగడ లేదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, మాజీ జడ్పీటీసీ రవి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ భగత్, మాజీ ఎంపీటీసీలు సుర్జీల్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## విత్తన దుకాణాల్లో తనిఖీలు



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని పలు విత్తనాల దుకాణాల్లో వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. వ్యవసాయ అధికారులు నదీం, రాజలింగంతో పాటు ఎస్సై ఆంజనేయులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు విక్రయించినవారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

**రశీదులు తీసుకోవాలి..** రైతులు ఫర్టిలైజర్ దుకాణాల్లో మందులు తీసుకున్న అనంతరం తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని వ్యవసాయ, పోలీసు శాఖల అధికారులు సూచించారు.

# కబ్జా కోరల్లో ఆలయ భూమి..

### దర్గాగా మొరం అక్రమ తవ్వకాలు తహశీల్దార్‌కు స్థానికుల ఫిర్యాదు

**భూకబ్జాదారుల ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ, శిఖం భూములు మాత్రమే కాకుండా.. దేవాలయ భూములను సైతం రాత్రికిరాత్రి కబ్జా చేసేస్తున్నారు. గాంధారి మండలంలోని గుడిమెట్ శివారులో గల మహదేవుని గుట్టను కొంతమంది కబ్జా చేస్తున్నారు. ఇప్పటికే గుడిమెట్, మాధవ్‌పల్లికి చెందిన భక్తులు తహశీల్దార్ రేణుక చావన్‌కు వినతిపత్రాలు అందించారు. కబ్జా కోరల నుంచి ఆలయ భూమిని కాపాడాలని విన్నవించారు. మరోవైపు ఈ ప్రాంతంలో అక్రమ మొరం తవ్వకాలు సైతం చేపట్టారు. అయినా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. – అక్షరటుడే, గాంధారి**



కబ్జాకు పాల్పడుతున్న గుట్ట ప్రాంతం గత కొన్నేళ్లుగా ఆలయ కమిటీ ఆధీనంలో ఉందని భక్తులు చెబుతున్నారు. తాజాగా.. కొందరు వ్యక్తులు భూమిని కబ్జా చేయడమే కాకుండా.. దర్గాగా అక్రమ మొరం తవ్వకాలు జరుపుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భూముల పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



మహదేవుని గుట్టపై ఉన్న భూమి ఆక్రమణకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. మండల సర్వేయర్‌తో సర్వే చేయించాం. ఎవరైనా ఎలాంటి హక్కులు లేకుండా కబ్జాకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

**– రేణుక చౌహాన్, గాంధారి తహశీల్దార్**

## పరిశోధన అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి



**అక్షరటుడే, ఇందూరు:** విద్యార్థులు పరిశోధన అంశాలపై అవగాహన పెంపొందించుకుంటే ఉన్నత విద్యలో ఎంతో ఉపయోగపడుతుందని గిరిరాజ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. 'విద్యా రచనలు, ప్రాజెక్టు నివేదికలు' అనే అంశంపై గురువారం కళాశాలలో ఒకరోజు కార్యాశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కేవలం అవగాహన కల్పించుకోవడమే కాకుండా మెలకువలను నేర్చుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ జాన్ సుకుమార్ పరిశోధనా పద్ధతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా జాన్ సుకుమార్, శ్యాంకుమార్‌ను కళాశాల తరపున సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్యాం కుమార్, డాక్టర్ గంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ దండు స్వామి, వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజేష్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి, గ్రంథ పాలకులు పూర్ణచంద్రరావు, సీనియర్ అసిస్టెంట్ ఉదయభాస్కర్, అధ్యాపకులు ప్రతిభ పాల్గొన్నారు.

## మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే ఫిర్యాదు చేయాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని మోపాల్ ఎస్సై యాదగిరి గౌడ్ అన్నారు. శుక్రవారం మోపాల్ మండలకేంద్రంలోని ప్రెసిడెన్సీ పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్లు వాహనాలు నడపవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డ్రగ్స్‌పై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీం సిబ్బంది స్రవంతి, రేఖ, రాణి, శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపాల్ పవన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, అకడమిక్ కో–ఆర్డినేటర్ రజిత పాల్గొన్నారు.

## సెంట్రల్ లైటింగ్ పనుల్లో వేగం పెంచాలి



**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులు ఏళ్లుగా నిలిచిపోయామని వెంటనే పనులు పూర్తిచేయాలని బీజేపీ కామారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షురాలు అరుణతార డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పనులు వెంటనే పూర్తి చేయాలని లేకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకోలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థపై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. నిరసనలో జిల్లా బీజేపీ నాయకులు రాము, అశోక్, రాజ్, రవిచంద్ర, పిట్లం మండల పార్టీ అధ్యక్షుడు గుండా సాయిరెడ్డి, మాజీ అధ్యక్షుడు అభినయ్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దేవేందర్, ఉపాధ్యక్షుడు సాయిగొండ, లాకావత్ గోపాల్, సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, ధర్మారం శివాజీ పటేల్, మద్దెల నవీన్, రాంప్రసాద్, రాములు, విజయ భాస్కర్, కృష్ణ షెట్కార్, పండరి రెడ్డి, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నియంత్రణపై అవగాహన

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. డిచ్‌పల్లి సీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మత్తు పదార్థాలు.. దుష్పరిణామాలు, తదితర అంశాలపై వివరించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఇష్టారీతిన మద్యం అమ్మకాలపై చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలం మిర్జాపూర్ గ్రామంలో ఇష్టారీతిన జరుగుతున్న మద్యం విక్రయాలను నియంత్రించాలని గ్రామస్థులు కోరారు. ఈమేరకు శుక్రవారం ఎస్సై లావణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నపాటి కిరాణ దుకాణాల్లో మద్యం విక్రయాలు జరుపుతున్నారని, దీంతో చిన్నపిల్లలు సైతం మద్యానికి అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత వ్యసనానికి బానిసగా మారకుండా, మద్యం విక్రయాలు అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్బిడి రమేష్, మోహన్, నగేష్, శైలాని, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

## అవసరం మేరకే యూరియా వాడాలి

**అక్షరటుడే, ఇందల్వాయి:** పంటలకు రైతులు అవసరం మేరకే యూరియా వాడాలని మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం ఇందల్వాయి సొసైటీలో యూరియా అమ్మకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో యూరియా అందుబాటులో ఉందని, కొరత లేక్కడా లేదన్నారు. ఇప్పటివరకు సొసైటీ, ప్రైవేట్ డీలర్స్ ద్వారా 950 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందించినట్లు పేర్కొన్నారు. డీలర్లు ఈపాస్ మెషిన్ ద్వారానే యూరియా అమ్మకాలు చేయాలని సూచించారు.



## మెనూ ప్రకారం భోజనం అందించాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ రాజు సూచించారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ సాంఘిక సంక్షేమ ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. ప్రత్యేకించి భోజనం మెనూ గురించి ఆరాతీశారు. అనంతరం హాస్టల్ అధికారులతో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా సదుపాయాలు కల్పించాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వంటగది పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తం ఉండాలని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, నీళ్లు నిలిచిన పలు ప్రదేశాలను మలేరియా అధికారి తుకారాంతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



## బాధితుడికి చెక్కు అందజేత

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని లోలం గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త రాంపురం గంగాధర్ విద్యుత్ ప్రమాదంలో గతంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చొరవతో ఆయనకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఇందుకు సంబంధించిన రూ. 1.80 లక్షల విలువైన చెక్కును శుక్రవారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, శేఖర్, రామకృష్ణ, కిషన్, కుమార్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



## విద్యారంగ సమస్యలపై ఒత్తిడి తేవాలి

**అక్షరటుడే, ఇందూరు:** ప్రభుత్వ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాను కలిసి విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్, బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలను విడుదల చేసేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. నగరంలోని ప్రభుత్వ పాఠశాలలు అధ్వానంగా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తేగా, సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి, నగర కార్యదర్శి మహేష్, మారుతి, వేణు, తదితరులు పాల్గొన్నారు.